క్లుప్తంగా

సన్మానం



జనగామ: డీఎంహెచ్ఓగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న డాక్టర్ మల్లికార్జున్‌రావును ఐఎంఏ కమిటీ మర్యాద పూర్వకంగా కలిసింది. ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలాజీ, సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, కోశాధికారి డాక్టర్ వనం శ్రీనివాస్, సీనియర్ డాక్టర్లు రాజమౌళి, లవకుమార్‌రెడ్డి, శ్రీనివాస్, కనకరాజులు డీఎంహెచ్ఓకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అనంతరం ఆయనతో మాట్లాడారు.

డీఎంహెచ్ఓను కలిసిన 108 అంబులెన్స్ జిల్లా మేనేజర్



జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్‌రావును 108 అంబులెన్స్ జిల్లా మేనేజర్ మండ శ్రీనివాసు సిబ్బందితో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. జిల్లాలో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలకు సంబంధించి 108 అంబులెన్స్, 102 అమ్మఒడి సేవలపై నివేదిక అందించారు. రెండు మండలాలకు ఒక్కటి చొప్పున 108, 102 వాహనాలు ఉన్నాయన్నారు. ప్రతి మండలానికి అంబులెన్స్‌లు వచ్చే విధంగా చూడాలని విన్నవించగా, డీఎంహెచ్‌వో సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రవికుమార్, రాంబాబు, భాస్కర్, సంపత్ ఉన్నారు.

నియామకం



జనగామ: భువనగిరి పార్లమెంట్ అడ్‌హక్ కమిటీ సభ్యుడిగా జనగామ పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్యను నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కుందారం కృష్ణమాచారి, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామిని హరీష్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారికి సమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా బాల్‌రాజు



బచ్చన్నపేట: పద్మశాలి సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా బచ్చన్నపేటకు చెందిన మాజీ ఎంపీపీ వేముల బాల్‌రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం బాల్‌రాజు తనకు పదవి రావడానికి కృషి చేసిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఎం మండల కార్యదర్శిగా వెంకటేశ్



సీపీఎం మండల కార్యదర్శిగా బెల్లంకొండ వెంకటేశ్ రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటానని తెలిపారు.

గిఫ్ట్ రిజిస్ట్రేషన్ రద్దు చేసి న్యాయం చేయండి



చిల్పూరు: పక్షవాతం వచ్చి వీల్‌చైర్‌కు పరిమితమైన తనను పట్టించుకోని కుమారుడి పేర చేయించిన వ్యవసాయ భూమి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ రద్దు చేసి భూమి తనపేర మార్చి న్యాయం చేయాలని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన తోట నారాయణ-భారతమ్మ దంపతులు కోరారు. బుధవారం నారాయణ మాట్లాడుతూ ఆపద సమయంలో ఆదుకుంటాడనుకుని కొడుకు పేర తనకున్న 5 ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని 2010లో గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశానని తెలిపాడు. కొన్నేళ్లు బాగానే ఉన్న కుమారుడు 2022లో తనకు పక్షవాతం వచ్చి వీల్ చైర్‌కు పరిమితమైతే పట్టించుకోవడం మానేషాడ న్నారు. చికిత్సకు డబ్బులు అడిగితే కుమారుడు పట్టించుకోకపోవడంతో గ్రీవెన్ సెల్ ఫిర్యాదు చేయగా కలెక్టర్ స్పందించి వెంటనే వృద్ధాప్య చట్టం కింద కుమారుడిపై చర్య తీసుకుని, రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓను ఆదేశించినట్లు తెలిపారు. విచారణ చేపట్టిన ఆర్డీఓ రిజిస్ట్రేషన్ రద్దు చేయకుండా అన్యాయం చేశారని, దీనిపై విచారణ చేపట్టి తన భూమి ఇప్పించాలని కోరాడు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత వెంకటాచారి అన్నారు. బుధవారం మండలంలోని కట్కూర్ గ్రామంలో ఆర్‌వీఎం గజ్వేల్ ఆస్పత్రి ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు పలువురికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

కొనుగోళ్లను ఆన్‌లైన్ చేయాలి



నర్మెట: నిర్వాహకులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

నర్మెట: కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ అన్నారు. కన్నెబోయినగూడెంలో పీఏసీఎస్, వెల్దండలో ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించిన ఆయన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఎంత కొనుగోలు చేశారు, మిల్లులకు ఎంత ధాన్యం తరలించారు తదితర ట్రక్ షీట్ వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఆయనవెంట తహసీల్దార్ రామానుజాచార్యులు, సివిల్ సప్లై డీటీలు ఇట్టెబోయిన శ్రీను, దేవా, ఏఓ ధరావత్ సంతోషి, ఆర్‌ఐ సింగారపు సాయిబాబ, ఏఈఓ కన్నయ్య తదితరులున్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

చిల్పూరు: ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. మండలంలోని రాజవరం, వెంకటాద్రిపేట, మల్కాపూర్, చిల్పూరు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉంచరాదని, లోడ్ కాగానే మిల్లులకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఐకేపీ ఏపీఎం ఈద రమేష్‌కుమార్, ఆర్‌ఐ కల్వల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ధాన్యం తరలించాలి

బచ్చన్నపేట: నిబంధనల మేరకు తేమ శాతం ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. మండలంలోని కొడవటూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంఆర్‌ఐ శ్రీనివాస్‌రావు, సీసీ సత్యనారాయణ, సీఏ గంగం వాణీ. ఏఈఓ రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు సాఫీగా వెళ్లడమే లక్ష్యం



టోల్‌ప్లాజా వర్కర్స్ యూనియన్ ఎంపిక పత్రం అందజేస్తున్న కుమార్‌గౌడ్

రఘునాథపల్లి: హనుమకొండ-హైదరాబాద్ జాతీయ రహదారిలోని టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు ఇబ్బందులు లేకుండా వాహనాలు సాఫీగా వెళ్లడమే టోల్‌ప్లాజా వర్కర్స్ యూనియన్ లక్ష్యమని యూనియన్ గౌరవ నూతన అధ్యక్షుడు వై.కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం కోమల్ల టోల్ ప్లాజా వద్ద పని చేసే ప్రైవేట్ ఉద్యోగులతో కలిసి ఆయన నూతన టోల్‌ప్లాజా వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా వై.కుమార్‌గౌడ్, అధ్యక్షుడిగా సమీర్‌ఆలీ, ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శి గడ్డం కరుణాకర్, సహాయ కార్యదర్శిగా బండి శ్రవణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఆకునూరి రాజు, చాతరబోయిన నాగేష్, కోశాధికారిగా తాళ్లపల్లి ఉదయ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న పెన్షనర్లు

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్లు, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఘన్‌పూర్ యూనిట్ అధ్యక్షుడు ఎండీ.దస్తగిరి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఘన్‌పూర్ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కోతి భిక్షపతి, జనార్దన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కొమురెళ్ళి, సరసిజ, దీనమ్మ, వెంకటయ్య, ఓంకార్ పాల్గొన్నారు.

విద్యుత్‌స్తంభం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని రాఘవాపూర్‌లో క్రీడాప్రాంగణంలో ఇనుప విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఒరిగి ఉండటంతో పాటు రక్షణ వలయం లేకుండా తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంపై ఈనెల 3న సాక్షి దినపత్రికలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. ఎన్పీడీసీఎల్ డీఈ ఆదేశాల మేరకు ఏఈ శంకర్ పర్యవేక్షణలో బుధవారం సంబంధిత పనులు చేపట్టారు. ప్రమాదకరంగా ఒరిగి ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాన్ని తొలగించడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌కు నూతన గద్దెను ఏర్పాటు చేసి సురక్షితంగా అమర్చారు. ఈ సందర్భంగా ఏఈ శంకర్ మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ పరంగా ఏమైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకు రావాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు. కాగా, గ్రామంలోని క్రీడాప్రాంగణంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ విషయమై సాక్షిలో కథనం రావడంతో విద్యుత్‌శాఖ అధికారులు సమస్యను పరిష్కరించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మన్ యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చి ఉన్నత స్థాయికి చేరుకోవాలి



ఏసీపీని సన్మానిస్తున్న క్రీడాకారులు

జనగామ రూరల్: క్రీడాకారులు పోటీల్లో ప్రతిభ కనబర్చి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఏసీపీ పార్థసారథి అన్నారు. యాదాద్రి జిల్లాలో తుర్కపల్లి మండలంలోని మాదాపూర్‌లో ఈనెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించే 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ అండర్-17 పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఏసీపీ బుధవారం క్రీడా దుస్తులు పంపిణీ చేసి మాట్లాడారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తేవాలని అన్నారు. స్థానిక ధర్మకంచ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పోగులు నరేందర్, నర్మెట మండలం కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ తేజావత్ మోహన్, జిల్లా సీనియర్ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు నేనావత్ సురేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



నర్మెట: పరామర్శిస్తున్న నాయకులు

రఘునాథపల్లి: మండలంలోని గబ్బెట గ్రామంలో మంగళవారం పెండెల నరేశ్ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో రూ.5 లక్షల విలువైన వస్తువులు దగ్ధమై నిరాశ్రులైన విషయం విదితమే. సమాచారం తెలుసుకున్న జనగామ ఆయుష్మాన్ ఆస్పత్రి ప్రొఫెసర్, తెలంగాణ మాజీ సైనికుల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కల్నల్ భిక్షపతి బుధవారం గబ్బెటకు చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 వేల నగదు, 50 కేజీల బియ్యం అందజేసి దాతృత్వం చాటారు. కట్ల సదానందం, రాంప్రసాద్, కొమురయ్య, సత్యనారాయణ, రామంజనేయులు ఉన్నారు.

నర్మెటలో..

నర్మెట: మండలకేంద్రానికి చెందిన కొత్త భిక్షపతి (డప్పు బుచ్చయ్య) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. కాగా, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్ రూ.2,500, మాజీ సర్పంచ్ కమలాకర్‌రెడ్డి నిత్యావసరాలు, బియ్యం, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నక్కల రవి రూ.2 వేల సాయం అందించి బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. ఎండీ గౌస్, తిరుపతిరెడ్డి, గాల్‌రెడ్డి, కిరణ్‌కుమార్, రాధాకృష్ణ, మహేందర్, బాలకృష్ణ, కరుణాకర్, కృష్ణ తదితరులు ఉన్నారు.

కేంద్ర నిధుల వినియోగంపై పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఎల్‌ఎం బృందం

దేవరుప్పుల: కేంద్ర ప్రభుత్వం నిధులు క్షేత్రస్థాయిలో అమలువుతున్న తీరుతోపాటు వినియోగంపై జాతీయస్థాయి పర్యవేక్షణ సభ్యులు జుబైర్ కీవీస్, జెన్సీ లారెన్స్ కలిసి పరిశీలించారు. మంగళవారం మండలంలోని దారావత్‌తండా, సీతారాంపురం గ్రామ పంచాయతీ పరిధి ఉపాధి హామీ తదితర పనుల కింద నిధులతో చేపట్టిన పనుల పరిశీలనకు వచ్చిన ఎస్‌ఎల్‌ఎం సభ్యులకు అధికార యంత్రాగం, మహిళ సంఘాలు ఘనస్వాగతం పలికాయి. అనంతరం పలు చోట్ల పనులు పరిశీలించి జీపీల్లో రికార్డులు సరిచూశారు. అడిషనల్ డీఆర్‌డీఓ చంద్రశేఖర్, డీపీఎం వినీత, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంపిఓ సురేష్‌కుమార్, ఈజీఎస్ ఏపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి



కొడకండ్ల: సర్వేపై సూచనలిస్తున్న పింకేష్‌కుమార్



చిల్పూరు: సర్వేను పరిశీలిస్తున్న స్వరూపరాణి



నర్మెట: సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ మాధురి

కొడకండ్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ (పంచాయతీ రాజ్) పింకేష్‌కుమార్ సూచించారు. బుధవారం మండలకేంద్రంలో ఇంటింటి సర్వే స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు సరైన సమాచారాన్ని అందించి సహకరించాలన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సమగ్ర ఇంటింటి సర్వేను ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఎన్యూమరేటర్లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రమోహన్, ప్రత్యేక అధికారి రవిందర్, ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి, ఎంపీఓ ఇందిర, కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను పరిశీలించిన డీపీఓ

చిల్పూరు: ఇంటింటి సర్వేను మండలంలోని లింగంపల్లి గ్రామంలో డీపీఓ స్వరూపరాణి పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎంపీఓ మధుసూదన్, మాజీ సర్పంచ్ ఏదునూరి రవీందర్ తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా చేపట్టాలి

నర్మెట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పారదర్శకంగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ మాధురి కిరణచంద్ర షా అన్నారు. మండల కేంద్రంతోపాటు బొమ్మకూర్‌లో తలపెట్టిన సర్వేను పరిశీలించిన ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ రామాజాచార్యులు, ఆర్‌ఐ సింగారపు సాయిబాబా, ఎంఈఓ మడిపెద్ది ఐలయ్య, సూపర్ వైజర్లు పాతూరి ఆంజనేయులు, ఎన్యుమరేటర్లు కందకట్ల శ్రీధర్, సీహెచ్ కావ్య పాల్గొన్నారు.

తరిగొప్పులలో..

తరిగొప్పుల: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో అధికారులు, ఎన్యుమరేటర్లు కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి కుటుంబ యజమాని పేరుపై స్టిక్కర్స్ అతికించడం జరిగింది. పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఆర్‌ఐ రవీందర్, ఎన్యుమరేటర్స్ కొడ లక్ష్మీనారాయణ, కొండ శ్రీనివాస్, ఎల్లయ్య, శ్రీరాములు, నరేందర్, సంపత్ కుమార్, శ్రీనివాసులు, తాటికొండ పెద్దన్న, అంగన్‌వాటీ టీచర్లు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు చేపట్టారు. ఎంపీడీఓ మల్లికార్జున్, తహసీల్దార్ ప్రకాష్‌రావు పర్యటించి ఈ సర్వేను పరిశీలించారు.

విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: ఇంటింటి సర్వేను విజయవంతం చేయాలని మండల ప్రత్యేక రాధాకిషన్, ఎంపీడీఓ సుమన్ కోరారు. మండలంలోని గ్రామాల్లో చేపట్టిన ఎన్యూమరేటర్లు ఇంటింటి సర్వేను చేపట్టగా వారు పరిశీలించి పలుసూచనలు చేశారు.

రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి: సమగ్ర కుల గణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. మాధారంలో జరుగుతున్న కుటుంబ సర్వే స్టిక్కర్ల కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. సర్వే ఎలాంటి పొరబాట్లు లేకుండా చేయాలని సూచించారు. జీపీ కార్యదర్శి కుమారస్వామి, అంగన్‌వాడీ టీచర్లు మంగమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ సరిత, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

ఎల్లంల, పెద్దరాంచర్లలో..

జనగామ రూరల్: ఈనెల 9వ తేదీ నుంచి చేపట్టనున్న ఇంటింటి సమగ్ర సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎల్లంల, పెద్దరాంచర్ల గ్రామాల్లో డోర్ స్టిక్కరింగ్‌ను ఆయన పరిశీలించారు.

సర్వేకు సహకరించాలి

కొడకండ్ల: ఇంటింటి సర్వేకు ప్రజలంతా సహకరించి ప్రభుత్వ లక్ష్యానికి చేయూతనివ్వాలని కొడకండ్ల బ్లాక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, సురేష్‌నాయక్ కోరారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. నల్ల శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

సబ్ సెంటర్‌లో తనిఖీ



లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల సబ్ సెంటర్‌ను బుధవారం డీఎంహెచ్ఓ మల్లికార్జున్‌రావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణి పరీక్షలు, పౌష్టిక ఆహారంపై అవగాహన, వ్యాక్సినేషన్, ఎన్‌సీడీ స్క్రీనింగ్ తదితర కార్యక్రమాలపై రికార్డులు పరిశీలించి ఏఎన్ఎం సంపూర్ణకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఆయనతో పాటు మాస్ మీడియా అధికారి ప్రభాకర్, సీహెచ్ఓ జయపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సిబ్బంది పనితీరుతోనే ప్రజారోగ్య పరిరక్షణ

దేవరుప్పుల: క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరుతోనే ఆశించిన లక్ష్యసాధనతో ప్రజారోగ్య పరిరక్షణ సాధ్యమని డీఎంఅండ్‌హెచ్ఓ కె.మల్లికార్జున్‌రావు అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజువారీ, నెలవారీ రికార్డుల పనీతీరుపై ఆరోగ్య సిబ్బందితో చర్చించారు. మండల వైద్యాధికారి పూజ, జిల్లా యంత్రాంగం ప్రభాకర్, పి.జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఆటోడ్రైవర్



బ్యాగును అందజేస్తున్న ఆటో డ్రైవర్ శ్రీనివాస్

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మారపాక శ్రీనివాస్ తన ఆటోలో ప్రయాణికుడు మర్చిపోయిన మూడు తులాల బంగారం ఉన్న బ్యాగును తిరిగి అందించిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తపెల్లికి చెందిన కొండం కొండల్‌రెడ్డి బంధువులు వ్యక్తిగత పనుల నిమిత్తం కొత్తపల్లి నుంచి ఘన్‌పూర్‌కు మారపాక శ్రీనివాస్ ఆటోలో వెళ్లారు. కాగా, ఘన్‌పూర్‌లో ఆటో దిగాక వారు తమ వెంట తెచ్చుకున్న బ్యాగును ఆటోలో మర్చిపోయిన విషయాన్ని గమనించారు. సదరు బ్యాగులో మూడు తులాల బంగారం ఉందని, వెంటనే కొండల్‌రెడ్డికి ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. కొండల్‌రెడ్డి వెంటనే కొత్తపల్లి, తాటికొండ ఆటో యూనియన్‌వారికి సమాచారం అందించారు. కాగా, సదరు బ్యాగును తన ఆటోలో గుర్తించిన శ్రీనివాస్ తాటికొండ మాజీ ఉపసర్పంచ్ మారపాక రాములు, సర్దార్ సర్వాయ్ పాపన్న ఆటోయూనియన్ అధ్యక్షుడు మారపాక కుమార్ సమక్షంలో కొండల్‌రెడ్డికి అందించి తన మానవత్వాన్ని చాటుకున్నాడు. ఆటోలో దొరికిన బ్యాగును తిరిగి అందించిన శ్రీనివాస్‌ను గ్రామస్తులు, తోటి ఆటో డ్రైవర్లు అభినందించారు.

విద్యార్థులకు అతిథి భోజనం



అతిథి భోజనం వడ్డిస్తున్న ఉపాధ్యాయులు

తరిగొప్పుల: మండలంలోని సోలిపూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు పద్మజ కుమార్తె పెళ్లి రోజు సందర్భంగా విద్యార్థులకు బుధవారం అతిథి భోజనం ఏర్పాటు చేశారు. అదేవిధంగా భోజనానంతరం విద్యార్థులకు అరటిపండ్లు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి, సారంగపాణి, కార్తీక, నార్తిక్ పాల్గొన్నారు.

రాజశేఖర్ మృతి తీరని లోటు



దేవరుప్పుల: ఆరోగ్య శాఖలో హెల్త్‌అసిస్టెంటుగా విధులు నిర్వర్తిస్తూ సేవాగుణం కలిగిన ఇస్తారి రాజశేఖర్ మృతి తీరని లోటని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మాదాపురంలో రాజశేఖర్ మృతదేహానికి ఆయన తోపాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు, ఆరోగ్య సిబ్బంది, రెడ్‌ఫ్లాగ్ రాష్ట్ర కార్యదర్శి దొంతి రాజేశ్, ఎమ్మార్పీఎస్ నాయకులు చంద్రయ్య తదితరులు వేర్వేరుగా పూలమాల వేసి ఘననివాళులర్పించారు ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జనగామ రూరల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని భరోసా టీం సభ్యురాలు జి.రేష్మ అన్నారు. బుధవారం వడ్లకొండ ఉన్నత పాఠశాలలో భరోసా టీం, న్యాయవాదుల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు ఎం.స్వప్న, జి.కవిత, జి.దయామని, బి.సోనీ దయామణి, హెచ్ఎం ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

హామీల అమలులో విఫలం

చిల్పూరు: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య అన్నారు. మండలంలోని నష్కల్, వెంకటాద్రిపేట గ్రామాల్లోని ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల ఇన్‌చార్జి మాలోత్ రమేష్‌నాయక్‌తో కలిసి మాట్లాడారు. నాయకులు కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, ఉడుత వెంకన్న, బత్తుల రాజన్‌బాబు, అరూరి స్వామి, చిర్ర రాజు, కలకోళ రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పాము కలకలం

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం విద్యార్థులు ఆడుకునే సమయంలో గ్రౌండ్‌లోకి పెద్ద పాము రావడంతో పిల్లలు భయంతో పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న మాజీ వార్డు మెంబర్ మునిపల్లి ప్రభాకర్ అక్కడకు చేరుకుని పామును పట్టుకోవడంతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

సోమేశ్వర ఆలయంలో కార్తీక దీపోత్సవం

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు తాంబూలం, ప్రసాదం వాయినంగా అర్చకులు అందజేశారు. ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకయ్య, అర్చకులు డీవీఆర్ శర్మ, అనిల్ శర్మ, మత్తగజం నాగరాజు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

పాలకుర్తి టౌన్: మండలంలోని గూడూరులో అక్రమంగా నిల్వ చేసిన 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై దూలం పవన్‌కుమార్ తెలిపారు. గూడూరులో పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నాయని సమాచారంతో వలిపాషా, తన సోదరుడు మహమ్మద్ నజీర్ ఇంట్లో తనిఖీ చేసి 20 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అసైన్డ్ పట్టాభూముల స్వాధీనం తగదు

దేవరుప్పుల: గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో దివంగత సీఎం రాజశేఖరరెడ్డి నిరుపేదలకు ఇచ్చిన అసైన్డ్ పట్టా వ్యవసాయ భూములను అభివృద్ధి పేరిట పాలకవర్గాలు స్వాధీనం చేసుకునే చర్యలు తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సింగారపు రమేష్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని తహసీల్ ఎదుట చిన్నమడూరులో 524, 525, 527 సర్వేనంబరులో 43 మందికి కేటాయించిన భూమిలో ప్రస్తుత ప్రభుత్వం భూసేకరణ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బాధిత దళిత రైతులు ధర్నా చేసి తహసీల్దార్ మహిపాల్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. యాదగిరి, హైమ, మరియమ్మ, యాకన్న, శ్రీనివాస్,రేణుక, దేవదానం, యాదగిరి ఉన్నారు.